సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



జిల్లా సెలెక్షన్స్ రద్దు

పెదవేగి : పెదవేగి గురుకులంలో ఈనెల 4న జరగాల్సిన అండర్‌–19 జిల్లా జట్ల ఎంపికను రద్దు చేసినట్టు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పాలకొల్లు అర్బన్ : వడ్లవానిపాలేనికి చెందిన టెన్త్ విద్యార్థి ఎం.నాగ ఆదిత్య యోగాసన పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రెండు గోల్డ్ మెడల్స్ సాధించాడు.

మల్లన్నకు జలాభిషేకం



మొగల్తూరు : స్థానిక వడయార్‌పేటలోని భ్రమరాంభ సమేత వనమల్లికార్జున స్వామి ఆలయంలో జలాభిషేకం చేశారు. 108 కావిళ్లతో జలాలను తీసుకువచ్చి అభిషేకించినట్టు భక్తులు తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ ఫ్లెక్సీ చించివేత



ఉణుదుర్రు చించేసిన వైఎస్సార్ ఫ్లెక్సీ

ఉండి : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఉణుదుర్రులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చించేశారు. దీనిపై వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి జి.సుందర్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సోమవారం తెలిపారు. ఫ్లెక్సీని చించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చించివేయడం ఆటవికమని అన్నారు.

నరసాపురం కమిషనర్‌గా అంజయ్య



నరసాపురం : నరసాపురం మున్సిపల్ కమిషనర్‌గా ఎం.అంజయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1995లో హెల్త్ అసిస్టెంట్‌గా మున్సిపల్ శాఖలో చేరిన ఆయన 2015లో రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. పుట్టపర్తి నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ నియమితులయ్యారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయన్ను అభినందించారు. పట్టణంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని ఆయన అన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

భీమవరం(ప్రకాశం చౌక్) : రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సెలవును అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10 కాసుల బంగారం చోరీ

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం రెండో వార్డులో తాళం వేసిన ఇంట్లో జరిగిన చోరీ బంగారు, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2వ వార్డు గాయత్రి ఆలయం సమీపంలో గోపి విజయలక్ష్మి నివాసం ఉంటున్నారు. ఆమె కుమారుడు సమీపంలోనే ఉండటంతో రాత్రి అతనింటికి వెళ్లి పడుకుని తెల్లవారుజామున వస్తుంటారు. ఇలా ఈనెల 1న కుమారుడి ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం తన ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి తలుపులు తెరచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి 10 కాసుల బంగారం, 30 తులాల వెండి, 30 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కాంట్రాక్ట్ ఉద్యోగుల ర్యాలీ

భీమవరం: రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భీమవరంలో శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దివాకర్, ప్రకాష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకూ భీమవరం పట్టణంలోని లూథరన్ హైస్కూల్ నుంచి ప్రదర్శనగా బయల్దేరి అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఫ్లెక్సీల వివాదాలు

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని మల్లవరంలంక, కొప్పర్రులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు వివాదాలకు దారితీశాయి. మల్లవరంలంకలో వాటర్ ట్యాంక్‌పైన ఉన్న అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించి పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీని జనసేన నేత కుసుమ కిరణ్ ఏర్పాటుచేయడంతో దళిత నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. కిరణ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి అంబేడ్కర్ ఫ్లెక్సీని యథాస్థానంలో ఏర్పాటుచేయడంతో దళిత నేతలు ఆందోళన విరమించారు. అలాగే కొప్పర్రు ప్రధాన సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి అడ్డుగా జనసేన నాయకులు పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీ ఏర్పాటుచేయడంపై గ్రామానికి చెందిన టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు నిలదీయడంతో జనసేన నాయకులు ఫ్లెక్సీని పక్కకు జరిపి ఏర్పాటుచేయడంతో గొడవ సద్దుమణిగింది.



తణుకులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు



పాలకొల్లులో పార్టీ ఇన్‌చార్జి గుడాల గోపి ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

మహానేత.. మనసా స్మరామి

రాజన్నా.. నిను మరువలేమన్నా..

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి
- నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు
- పేదల హృదయాల్లో గూడు కట్టుకున్న రాజన్న
- వైఎస్‌తో అనుబంధం, ఆయన చేసిన మేలును గుర్తుచేసుకున్న నేతలు



తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



నరసాపురంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

సాక్షి, భీమవరం : మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించి 15 ఏళ్లు గడిచినా ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలంగానే ఉంటాయని జిల్లావాసులు ప్రతిధ్వనించారు. జోహార్ వైఎస్సార్.. జోహార్ వైఎస్సార్ అంటూ నినదించారు. తిరిగిరాని లోకాలకు తరలిపోయినా నీవు చేసిన మేలును, పంచిన ఆత్మీయ అనురాగాలను ఎన్నటికీ మరువలేమంటూ జనహృదహ నేతకు వాడవాడలా ఘన నివాళులర్పించారు. సోమవారం జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



పెదఅమిరంలో వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న సమన్వయకర్త పీవీఎల్ నరసింహరాజు

- తణుకు రాష్ట్రపతి రోడ్డులోని బాయ్స్ హైస్కూల్ వద్ద, వంగవీటి మోహనరంగా వీధిలోని వైఎస్సార్ పార్కులో గల వైఎస్ విగ్రహాలకు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- తాడేపల్లిగూడెంలోని పోలీస్ ఐలాండ్ సెంటర్, బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
- నరసాపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద, స్టీమర్ రోడ్డులోని వైఎస్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రే శ్రీవెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- కాళ్ల మండలం పెదఅమిరంలో వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆకివీడులో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి నివాళులు అర్పించారు. సిద్దాపురంలో పార్టీ నేత భూపతిరాజు బుజ్జిరాజు 50 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.
- పాలకొల్లులోని గాంధీ బొమ్మల సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.
- ఆచంట నియోజకవర్గంలోని తూర్పుపాలెంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద, పెనుగొండలో పార్టీ శ్రేణులు వైఎస్ వర్ధంతిని నిర్వహించారు. ఆచంట ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.



భీమవరంలోని గునుపూడిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

వైఎస్సార్‌ది చెరగని ముద్ర

శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

భీమవరం: సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుతో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించారని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. సోమవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గునుపూడిలో వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పాలన స్వర్ణయుగం వంటిదని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యార్థుల చదువుకు తోడ్పాటు అందించారన్నారు. అలాగే ఆరోగ్యశ్రీతో ప్రాణదాతగా, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, జలయజ్ఞంతో అపరభగీరధుడిగా నిలిచారన్నారు. అనంతరం ప్రజలకు స్వీట్లు పంచారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, నాయకులు బోకూరి విజయరాజు, పెనుమాల నర్సింహస్వామి, బలే యేసుబాబు, అబ్దుల్‌హాయ్, గణేష్, ఆనంద్ పాల్గొన్నారు.

ఏలూరుకు తమ్మిలేరు ముప్పు

- లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు
- అప్రమత్తమైన అధికారులు
- శనివారపుపేట కాజ్‌వేపైకి మూడు అడుగుల మేర వరద
- కొల్లేరులోకి భారీగా వరద నీరు విడుదల



ఏలూరులో తంగెళ్లమూడి వద్ద ఉధృతంగా తమ్మిలేరు


ఏలూరు (టూటౌన్): తమ్మిలేరు వరద ఏలూరు వాసులను భయపెడుతోంది. తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నగరానికి రెండు వైపులా ప్రవహించే తమ్మిలేరు ఇప్పటికే పలు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. తంగెళ్లమూడి ప్రాంతంలో ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శనివారపుపేట కాజ్‌వేపైన మూడు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తుండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిపేశారు. ఈ మార్గంలోకి వచ్చేందుకు టీటీడీ కల్యాణమండపం రోడ్డులోని గ్లేవియర్ నగర్ మీదుగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కొల్లేరులోకి భారీగా వరద నీరు

నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు జలాశయం నుంచి పెద్ద ఎత్తున దిగువకు వరద నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఏలూరు నగరానికి తూర్పు పడమరగా విస్తరించిన తమ్మిలేరు నుంచి రెండు లాకుల వద్ద పెద్ద ఎత్తున వరద నీటిని కొల్లేరులోకి విడుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది వరద పరిస్థితి సమీక్షిస్తున్నారు.

తమ్మిలేరు కాజ్‌వేకు గండి

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట వద్ద తమ్మిలేరు కాలువ వాగు కాజ్‌వేకు సోమవారం మళ్లీ గండి పడింది. వాగుకు వరద వచ్చినపుడల్లా గండికి తాత్కాలికంగా మరమ్మతులు చేయడంతో తరచూ గండిపడుతోంది. శాశ్వత మరమ్మతుల కోసం నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఎన్నికల కోడ్ వల్ల పనులు ప్రారంభించలేదు. నెల క్రితం వాగుకు వరద రావడంతో మండల పరిషత్ నిధుల నుంచి రూ.2 లక్షలతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. మూడు రోజుల నుంచి భారీగా వరద రావడంతో కాజ్‌వేకు మళ్లీ గండి పడింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద ఉధృతంగా తమ్మిలేరు

ఉధృతంగా తమ్మిలేరు

చింతలపూడి: భారీ వర్షాలకు తమ్మిలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరింది. సోమవారం అధికారులు తమ్మిలేరు మూడు గేట్ల ద్వారా 3,839 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 347.42 అడుగులకు, గోనెలవాగు బేసిన్ 347.39 అడుగులకు చేరుకుందని తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ పరమానందం తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 3 టీఎంసీలు కాగా 1,736 టీఎంసీలకు చేరుకున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లా బేతుపల్లి అలుగుపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో గంటకు 4,006 క్యూసెక్కుల నీరు ఆంధ్రా కాల్వ ద్వారా ప్రాజెక్టులోకి వస్తోంది.

కాలువ గట్లపై నిరంతర పర్యవేక్షణ



యనమదుర్రు డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్) : భారీ వర్షాల వల్ల పొంచి ఉన్న ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన నందమూరు అక్విడెక్ట్, ఎరక్రాలువ, భీమవరంలోని బైపాస్ వద్ద యనమదుర్రు డ్రెయిన్, మెంటేవారి తోట ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద తగ్గుతున్నా నిరంతరం గట్ల పటిష్టతపై పర్యవేక్షణ చేయాలన్నారు. రానున్న మూడు, నాలుగు రోజుల్లో మరో అల్పపీడనం ఏర్పడనున్నట్లు హెచ్చరికల నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. గోదావరి వెస్ట్రన్ డివిజన్ నిడదవోలు ఈఈ ఎం.దక్షిణామూర్తి, ఇరిగేషన్ డీఈలు సత్యదేవ్, ఎ.రవీంద్రబాబు, ఏఈ వెంకటేశ్వరరావు, జేఈలు కిరణ్, పెద్దిరెడ్డి, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ డి.త్రినాథరావు, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు ఆయన వెంట ఉన్నారు.

తీర్పును సమీక్షించే వరకూ పోరాడతాం



భీమవరంలో జరిగిన మాలమహానాడు సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

భీమవరం : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. సోమవారం భీమవరంలో నిర్వహించిన మాల మహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో సుప్రీం ధర్మాసనం ఎస్సీలను వర్గీకరించడం రాజ్యాంగ విరుద్ధమని తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. వర్గీకరణ చేయాలంటే ఆర్టికల్ 341 సవరించాలన్నారు. ఎస్సీల రిజర్వేషన్ల ఫలాలను మాలలే అనుభవిస్తున్నారని మందకృష్ణ మాదిగ మాట్లాడటం సబబు కాదన్నారు. మందకృష్ణ తన స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీతో జతకట్టి వర్గీకరణ కోరుతున్నారని విమర్శించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు పునఃసమీక్షించే వరకూ పోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు కటికతల రాజారావు, కోన జోసెఫ్, విజయ్ కుమార్, ఈద రవికుమార్, కె.ధనరాజు, గాలి సామ్రాజ్యం, గాతల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు 80 వేల ఆహార పొట్లాలు



భీమవరం నుంచి ఆహార పొట్లాలు పంపిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడలోని వరద బాధితుల కోసం పశ్చిమ గోదావరి జిల్లా నుంచి దాదాపు 80 వేల ఆహార పొట్లాలు పంపించారు. భారతీయ విద్యాభవన్ గోదావరి విద్య వికాస్ చైతన్య సొసైటీ, నరసాపురం స్వర్ణాంధ్ర కాలేజ్, తాడేపల్లిగూడెం రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉద్యానవన యూనివర్సిటీ, నిట్ యూనివర్సిటీ, వాసవి ఇంజనీరింగ్ కాలేజ్, శశి ఇంజనీరింగ్ కాలేజ్, భీమవరం విష్ణు కాలేజీల సహాయ సహకారాలతో ఆహార పదార్థాలను తయారు చేసి అందించడం అభినందనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణతో విజయవాడకు సకాలంలో ఆహార పొట్లాలను పంపించిందన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణం నరకమే!



వెంపలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భీమవరం అర్బన్ : మండలంలోని వెంప ఆర్ అండ్ బీ రోడ్డు ధ్వంసం అవడంతో భారీ గోతులు ఏర్పడ్డాయని.. ఆ రోడ్డుపై ప్రయాణం నరకంలా ఉందని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి వెంటనే గోతులు పూడ్చాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంపలో సోమవారం ప్రధాన రోడ్డుపై సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం వేలాది మంది నరసాపురం, మొగల్తూరు, భీమవరం మండలాలకు ఈ రోడ్డుపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారని.. గోతుల్లో పడి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే గోతులు పూడ్చాలని కోరారు.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



తణుకులో మహిళా కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

తణుకు టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్కెఎస్డీ మహిళా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి తెలిపారు. గ్రీన్ క్యాంపస్, క్లీన్ క్యాంపస్ కార్యక్రమంలో భాగంగా తణుకులోని ఎస్కెఎస్డీ మహిళా కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యూ లక్ష్మీ సుందరిబాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్యామలాదేవి, సీహెచ్ రమేష్ బాబు, ఇతర అధ్యాపక సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆగ్రాలో మెరిసిన లేడీ మెజీషియన్ ప్రసన్న



ఆగ్రాలో బహుమతి అందుకుంటున్న మెజీషియన్ ప్రసన్న

తణుకు అర్బన్ : తణుకుకు చెందిన లేడీ మెజీషియన్ దండ లక్ష్మీదేవి ప్రసన్న తాజ్ మ్యాజిక్ ఫెస్టివల్‌లో ద్వితీయ బహుమతి సాధించారు. తాజ్ మ్యాజిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఆల్ఇండియా స్థాయిలో ఈనెల 1వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో నిర్వహించిన ఈ ఫెస్టివల్‌లో మొత్తం వివిధ దేశాల నుంచి 14 మంది మెజీషియన్స్ హాజరుకాగా తన ప్రదర్శనకు రెండో బహుమతి దక్కినట్లు ప్రసన్న తెలిపారు.

అఖండ అన్నసమారాధన

అత్తిలి: శ్రీకృష్ణాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా అత్తిలి మట్టపర్తిగర్వులో సోమవారం అఖండ అన్నసమారాధన జరిపారు. రామకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

పర్యావరణాన్ని రక్షించుకోవాలి



తణుకులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు: తణుకు నియోజకవర్గంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేసి నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి



తణుకు అర్బన్: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు



తాడేపల్లిగూడెం అర్బన్: మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

- వాడవాడలా ఘనంగా వైఎస్సార్ వర్ధంతి
- వైఎస్ విగ్రహాలకు పూలమలలు వేసిన మాజీ మంత్రులు కొట్టు, కారుమూరి



అత్తిలి: గుమ్మంపాడులో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తణకు టౌన్ వేల్పూరులో రాజన్నకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు

తణుకు అర్బన్: సంక్షేమ సృష్టికర్త, ఆరోగ్య ప్రదాత, పేదల ఆరాధ్యుడిగా చరిత్రలో నిలిచిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జీవనశైలి స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం వైఎస్సార్ 15వ వర్ధంతి సందర్భంగా తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ ప్రాంతం, వంగవీటి మోహనరంగా వీధిలోని వైఎస్సార్ పార్కులో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలపక్షపాతిగా వైఎస్సార్ చేసిన పరిపాలన ఆదర్శనీయమని అన్నారు. అటువంటి మహనీయుడు మన మధ్య లేకపోవడం బాధాకరమని అన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితో ఆయన బాటలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, యిండుగపల్లి బలరామకృష్ణ, వి.సీతారాం, మారిశెట్టి శేషగిరి, గుబ్బల సూర్యచంద్రరావు, కుడుపూడి చంద్రరావు, జల్లూరి జగదీష్, పైబోయిన ఏసుబాబు, చోడే గోపీకృష్ణ, పుల్లెపు సూర్యచంద్రరావు, షేక్ ఫహీమా, ఝాన్సీ లారెన్స్, గారపాటి సత్యనారాయణ, పులగం వెంకటరెడ్డి, వై.రామకృష్ణ, గెద్దా శ్రీకాంత్, ఎస్వీ జాకబ్ బాబు, కె.రామకృష్ణ, కొమ్మోజు రామకృష్ణ, రేలంగి రాంబాబు, జిలాని, షేక్ బాజీ, దాసి రత్నరాజు, బొల్లా దుర్గాప్రసాద్, చింతన్న, రంభ నాగేశ్వరరావు, గనసాల సింగ్, పైబోయిన సాయితేజ పాల్గొన్నారు.

జన హృదయ నేత వైఎస్సార్

తాడేపల్లిగూడెం అర్బన్ : పేదల గుండెచప్పుడు డాక్టర్ వైఎస్.రాజశేకరరెడ్డి అని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక పోలీస్ ఐలాండ్, ఆర్టీసీ డిపో వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ మనందరి హృదయాల్లో జీవించి ఉన్నారన్నారు. తండ్రికి మించిన తనయుడిగా వైఎస్ జగన్‌మోహనరెడ్డి అందించిన పాలనను కూటమి ప్రభుత్వం అందించలేకపోవడం వారి అసమర్థతకు తార్కాణమన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి సంపత్‌కుమార్, బొద్దాని శ్రీనివాస్, షేక్ నౌషద్, వైఎస్ ఎంపీపీలు కట్టా రంగబాబు, సూర్పని రామకృష్ణ, దింటకుర్తి లీలావతి, మండల నాయకురాలు నూని అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మహనేత వైఎస్సార్

అత్తిలి: ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. అత్తిలిలో సోమవారం నిర్వహించిన వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జెడ్పీకోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, మండల పార్టీ నాయకులు రంభసూరిబాబు, కందుల సత్యనారాయణ, ఆకుల చినబాబు, కోరుకొల్లు వెంకట్రావు, సబ్బితి రాజేష్, గంటా నాగరాజు, దిరిశాల నాగబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

తణుకు టౌన్: మండలంలోని వివిధ గ్రామాల్లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం తణుకు మండలంలోని వేల్పూరు గ్రామంలో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల గ్రామంలోని వివిధ చోట్ల వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఆకుల సోమరాజు పాల్గొన్నారు. మండలంలోని ముద్దాపురం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, గ్రామ సర్పంచ్ మజ్జి పద్మలు దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దువ్వ గ్రామంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని కొమరవరం, మహాలక్ష్మీ చెరువు గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు గ్రామ సర్పంచ్‌లు కరిబండి రాజేష్, పాలా శ్రీను, కోనాల గ్రామంలో సర్పంచ్ మల్లిపూడి చిన్నయ్యల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తేతలి, మండపాక గ్రామాల్లో ఆయా గ్రామ కమిటీల అధ్యక్షులు కోట నాగేశ్వరరావు, పెండ్యాల మణికంత, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ప్రదాత వైఎస్సార్

తాడేపల్లిగూడెం రూరల్: ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత దివంగత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు అన్నారు. సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలో దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది వృద్ధులకు గొడుగులు పంపిణీ చేశారు. తమ్మిశెట్టి చుక్కయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు. కుంచనపల్లిలో ఉర్ల నవీన్, దంగడర్రలో ములగాల గంగారావు, పెద తాడేపల్లిలో పరిమి తులసీదాస్, వెంకట్రామన్నగూడెంలో పోలిమోను శ్రీనివాస్, ఆరుగొలనులో ఎమ్పీటీసీ నార్ని శంకరరావు, ఉప్పరగూడెంలో దండే కనకబాబు, వెంకట్రావుపాలెం ఎలిపే గాంధీ, బంగారుగూడెంలో చుండ్రు శ్రీనివాస్, వీరంపాలెంలో ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు), మారంపల్లిలో తాడేపల్లి మోషే, సరిపల్లి కృష్ణంరాజు, కృష్ణాయపాలెంలో కంఠమణి సత్యనారాయణ, చినతాడేపల్లిలో పిచ్చుకల రాజారావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, పుల్లాయగూడెంలో ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, నవాబుపాలెంలో మెహెర్‌ప్రసాద్, నందమూరులో కోనేటి దానయ్య, కొమ్ముగూడెంలో వెలిశెట్టి నరేంద్రకుమార్, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, మెట్ట ఉప్పరగూడెంలో వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

మహా నేత వైఎస్సార్

ఇరగవరం: చిరస్మరణీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని ఇరగవరం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని 21 గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, పెన్మెత్స సుబ్బరాజు, చోడే జోషి, గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, వెలగల సాయిబాబా రెడ్డి, బాబు మాజీ సొసైటీ అధ్యక్షులు, మల్లి రెడ్డి నాగార్జున, చవ్వాకుల శ్రీనివాస్, సైపురెడ్డి పెద్దిరాజు పాల్గొన్నారు.

పెంటపాడు: సోమవారం మండలంలోని వైఎస్సార్ వర్ధంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాదరెడ్డి, ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు, పార్టీ నాయకులు నలిమిల్లి విజయానందరెడ్డి, బుచ్చిప్రసాదరెడ్డి, జట్లపాలెం ఎంపీటీసీ కట్టుబోయిన వెంకటలక్ష్మి, బీసీ సంఘ నాయకులు కట్టుబోయిన కృష్ణప్రసాద్, రామచంద్రాపురం గ్రామానికి చెందిన చల్లా లింగమూర్తి, మాజీ సర్పంచ్ చల్లా కుమారస్వామి, పాలా గణపతి, దేవరశెట్టి రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకు టౌన్: దువ్వలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, గ్రామ సర్పంచ్ తదితరులు



తాడేపల్లిగూడెం రూరల్: మాధవరం గ్రామంలో వృద్ధులకు గొడుగులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఇరగవరం: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలి



మహాజన సభలో మాట్లాడుతున్న ఏపీఎం లక్ష్మి

తాడేపల్లిగూడెం రూరల్: మహిళలు స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని వెలుగు ఏపీఎం జీవీకే డీఎం లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో గ్రామ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం లక్ష్మి మాట్లాడుతూ సంఘంలోని మహిళలు క్రమంతప్పకుండా పొదుపు నిర్వహించాలన్నారు. నెలకు ఒకరిద్దరు చొప్పున సంఘం రుణ మొత్తాన్ని చెల్లించాలన్నారు. పదో తరగతి, ఆపై తరగతులు ఉత్తీర్ణులై వారు డ్రోన్ దీదీ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. తద్వారా ఎంపికైనవారికి శిక్షణనివ్వడం జరుగుతుందన్నారు. రూ.10లక్షలు విలువైన డ్రోన్ ను గ్రామానికి ఒకటి చొప్పున ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దీనిలో రూ.2లక్షలు సబ్సిడీ లభిస్తుందన్నారు. మండలసమాఖ్య అధ్యక్షురాలు మల్లిపూడి సుజాత, కార్యదర్శి డి.శేషారత్నం, కోశాధికారి వై.రమణ, సీసీలు రేఖ, హేమ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

యోగాతోనే మానసిక ఉల్లాసం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాతోనే మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫ్ నిట్ డాక్టర్ జీబీ వీరేష్ కుమార్ అన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు తాడేపల్లిగూడెం ఏపీ నిట్ యోగా హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మురళీ కృష్ణ, అసోసియేషన్ అధ్యక్షుడు ఇంజుమూరి మాధవరావు, ఛీఫ్ అడ్వయిజర్ కరిబండి రామకృష్ణ, డాక్టర్ వి.శ్రీనివాస్, యోగా సాధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి, మోదుగ గుంట, టిడ్కో సబ్‌స్టేషన్‌ల పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ ఈఈ ఎస్. వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకులగుంట, అమృతపురం, మోదుగ గుంట, గొల్లగూడెం, అప్పారావుపేట, వెంకట్రావు పాలెం, ఎల్అగ్రహారం, టిడ్కో గృహ సముదాయం, కొండ్రుప్రోలు, కేఎస్ఎన్ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే పట్టణంలోని హౌసింగ్ బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు సబ్ స్టేషన్ల పరిధిలోనూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున విద్యుత్‌వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బలరాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలని, చికెన్ గున్యాతో సహా అన్ని రకాల జ్వరాలను ఆరోగ్య శ్రీలో చేర్చాలని సీపీఎం జిల్లా విస్తృత సమావేశం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. పట్టణంలో సోమవారం మూడోవ రోజు జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ జ్వర పీడిత బాధితులకు ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు అందకపోవడం అన్యాయమన్నారు. పేదలు, సామాన్యులు వేలకు వేలు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య పరీక్షలతో సహా అన్ని రకాల జబ్బులకు ఉచిత వైద్య సేవలు అందేలా చూడాలని వైద్య ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దెబ్బతిన్న రోడ్లు, కాలువలు, విద్యుత్ వ్యవస్థలు మెరుగుపర్చాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సెక్రటేరియట్ సభ్యులు జేఎన్వీ గోపాలన్, ఎపీఎం రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, కర్రి నాగేశ్వరరావు, కేతా గోపాలన్, కవురు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, పి.వి.ప్రతాప్, డి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మి నారాయణ ఆర్థిక సహకారంతో కడకట్లలోని జనతా చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఉచిత షుగర్ రక్త పరీక్షలు జరిగాయి. 90 మందికి పరీక్షలు నిర్వహించారు. షుగర్ ఉన్నవారికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గరికపాటి బాపయ్య శర్మ, చిన్నం జగదీష్, ఎల్ఎస్వీ నాగేశ్వరరావు, వంగపండు రామ్మోహన్‌రావు, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

పాలసీదారుడికి భరోసా ఎల్ఐసీ



ఎల్ఐసీ బ్రాంచ్‌లో వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడుతున్న బ్రాంచ్ మేనేజరు రాజశేఖర్

తణుకు అర్బన్: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) పాలసీదారుడి కుటుంబానికి భరోసా కల్పిస్తుందని తణుకు ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజరు కెఎస్ రాజశేఖర్ అన్నారు. దేశవ్యాప్తంగా ఈనెల 7వ తేదీ వరకు నిర్వహించే ఎల్ఐసీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం తణుకు బ్రాంచ్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమండ్రి డివిజన్‌కు సంబంధించి వ్యాపారపరంగా తణుకు బ్రాంచ్ 2వ స్థానంలో నిలిచి ఖాతాదారులకు అత్యున్నత సేవలు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి 204.30 లక్షల పాలసీలతో రూ. 222.52కోట్ల ప్రీమియంతో 69.9 శాతం మార్కెట్ షేర్‌తో పాలసీలపరంగాను, ప్రీమియంపరంగాను 58.87 శాతంతో ఎల్ఐసీ అన్ని ఇన్సూరెన్స్ సంస్థలను దాటుకుని ప్రథమ స్థాయిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైటైర్డ్ చీఫ్ మేనేజరు పి.సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజరు కె.శివ, స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణ, కార్యదర్శి జి.సుబ్రహ్మణ్యం, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు, ఏజెంట్స్ యూనియన్ అసోసియేషన్ నాయకులు పీఎల్ నరసింహారావు, సలాది ఉదయ భాస్కరరావు, రవి రామకృష్ణ, ప్రసాద్, వైవీ శ్రీనివాస్, కృష్ణ, రంగారెడ్డి, యాళ్ల సత్యనారాయణ, కృష్ణప్రసాద్, జగ్గారావు పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో దండగర్ర పీడీకి గోల్డ్ మెడల్



యోగా పోటీల్లో బంగారు పతకం సాధించిన దండగర్ర జెడ్పీహెచ్ఎస్ పీడీ చంద్రశేఖర్‌తో విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు బి.చంద్రశేఖర్ గోల్డ్ మెడల్ సాధించారు. తద్వారా రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. అలాగే, స్కూలుకు చెందిన పి.రాజేష్ ద్వితీయ, కే.హేమంత్ తృతీయ స్థానం, చెరకు వడ్డికాసులు, అర్జుల మానస ద్వితీయ స్థానాలు సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా పీడీ చంద్రశేఖర్, విద్యార్థులను గ్రామసర్పంచ్ పిల్లా రాంబాబు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.